# మహిళలు సాధికారత దిశగా అడుగేయ్యాలి











**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

ప్రజా గొంతుక ప్రతినిధి/జనగామ,మార్చి 11:
మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలంటే సాధికారత దిశగా అడుగేయ్యాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు.సోమవారం కలెక్టరేట్ లోని సమావేశమందిరంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు.విశిష్ట అతిథులుగా జడ్పి చైర్ పర్సన్ గిరబోయిన భాగ్య లక్ష్మి,మున్సిపల్ చైర్మన్ పోకల జమున,జనగామ మండల జడ్పిటిసి నిమ్మతి దీపికా రెడ్డి పాల్గొనగా అదనపు కలెక్టర్ లు పింకేశ్ కుమార్,రోహిత్ సింగ్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సతీసమేతంగా హాజరయ్యి జ్యోతిప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మహిళలు పొదుపుతో సాధించిన బ్యాంక్ రుణాలను గృహ అవసరాలకు కాకుండా ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వివిధ వ్యాపార రంగాలలో పెట్టుబడులు పెట్టి సాధికారత దిశగా కొనసాగుతూ లాభాలు ఆర్జించాలని ఆకాంక్షించారు.విద్యతోనే ఏదైనా సాధించగలమని, వివక్ష ఉన్న పట్టుదలతో సమాజంలో రాణించాలన్నారు.ఆడ,మగ భేదం లేకుండా సమానత్వంతో పిల్లలను చదివించాలన్నారు.మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి.మహిళ శిశు సంక్షేమ శాఖలో మహిళల రక్షణకు పలు విభాగాలు చేస్తున్న కృషిని స్కిట్ ద్వారా ప్రదర్శించారు.వివాహ వయస్సు ఆడపిల్లకు 18,మగ పిల్లలకు 21 తప్పనిసరిగా ఉండాలన్నారు.బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని,ఆడపిల్లలను గర్భంలో చిదిమేసే స్కానింగ్ లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.కళాశాలల్లో ఆడపిల్లలను వేధిస్తే ఫోక్సొ చట్టం ప్రకారం శిక్షించడం జరుగుతుందని,వివాహితులను వరకట్నం కొరకు వేధిస్తే గృహహింస చట్టం క్రింద జైలుకు పంపడం జరుగుతుందన్నారు.ఆపదలో ఉన్న మహిళలను ఆదుకునేందుకు 181 కు కాల్ చేస్తే సఖి కేంద్రం వారు చర్యలు తీసుకుంటారన్నారు.పిల్లలయితే వారి పరిరక్షణకు తల్లిదండ్రులు కు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని, అనాథ పిల్లలకు ప్రభుత్వమే అండగా ఉంటుందని అందుకు

జిల్లాలో 2 చిల్డ్రన్స్ హోమ్స్ ఉన్నాయన్నారు.అనంతరం వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలకు సర్టిఫికెట్స్ ను కలెక్టర్ అందజేశారు.అదే విధంగా వివిధ శాఖల మహిళా అధికారులను మేమెంటోలతో సన్మానించారు. అనంతరం అధికారులచే సంతకాల సేకరణ చేశారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని,జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జయంతి,ఉద్యాన శాఖ అధికారిణి లత,పౌరసరఫరాల శాఖ అధికారిణి రోజా రాణి,బాలల పరిరక్షణ కమిటీ చైర్మన్ శ్రీలత,జిల్లా అధికారులు,సీడీపీవోలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.